



నైజాంపేటలో నినాదాలు





గన్నవరంలోని ఆర్‌ఆర్‌ఆర్ లే అవుట్

విమానాశ్రయ నిర్వాసితులతో మరో జగన్నాటకానికి తెరలేపారు. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం గన్నవరంలోని తన బస ప్రాంతంలో నిర్వాసితులతో జగన్ సమావేశం కావటానికి అధికార పార్టీ నాయకులు ఏర్పాట్లు చేశారు. జగన్‌తో సమావేశానికి నిర్వాసితులు అయిష్టత చూపినా.. అతికష్టంమీద పదిమందిని భేటీకి ఒప్పించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లు నిర్వాసితుల గోడు పట్టని సీఎం ఎన్నికలు ముందు ముఖాముఖి నాటకానికి తెరలేపడం వెనుక అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

మరో జగన్నాటకం

విమానాశ్రయ నిర్వాసితులతో నేడు జగన్ ముఖాముఖి

- ఐదేళ్లుగా పట్టించుకోక.. ఎన్నికల ముందు మాయ
- నిర్వాసితులు రాబోమంటున్నా బలవంతంగా భేటీ
- 420 మంది నిర్వాసితులుండగా పదిమందితోనే..

వచ్చేది లేదని తేల్చిచెప్పిన భూములిచ్చిన రైతులు

- సీఎం షెడ్యూల్ నుంచి ఆ కార్యక్రమం తొలగింపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ విమానాశ్రయ అభివృద్ధి కోసం అజ్జంపూడి, బుద్ధవరం, దావాజీగూడేనికి చెందిన దాదాపు 420 మందికి పైగా గూడు వదులుకుని నిర్వాసితులయ్యారు. వీరికి కిందటి టీడీపీ ప్రభుత్వం చిన్న అవుటపల్లిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించాలని నిర్ణయించి 48 ఎకరాలు సేకరించింది. మోడల్ గృహాలను నిర్మించాలనుకుని ప్లాట్లను కేటాయించే సమయానికి ఎన్నికలొచ్చాయి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం నిర్వాసితుల సమస్యలను గాలికొదిలేసింది. ఆ తర్వాత నిర్వాసితుల ఆందోళనల కారణంగా వారిని మభ్యపెట్టే కార్యక్రమాలు చేపడుతూ వచ్చింది. 'ఇళ్లు మీరే కట్టుకోండి. ఇంటికి రూ.9 లక్షలు రెండు విడతలుగా ఇస్తాం..' అని మభ్యపెట్టింది. ఈ ప్రతిపాదనకు నిర్వాసితులు అయిష్టంగానే ఒప్పుకొన్నారు. కరోనా తర్వాత మెటీరియల్ ధరల పెరుగుదల కారణంగా ఇంటి నిర్మాణ వ్యయం అమాంతం పెరిగింది. ప్రభుత్వం ఇస్తామన్న డబ్బు సరిపోని పరిస్థితి ఏర్పడింది. నిర్వాసితులు ఆందోళన ప్రారంభించగానే, ప్రభుత్వం ఏదో జీవోలను విడుదల చేస్తూ నాటకాలు ఆడింది. అప్పటి వరకు లే అవుట్‌లో కనీసం ప్లాట్లు కూడా కేటాయించని పరిస్థితుల్లో లాటరీ తీశారు. దీంతో నిర్వాసితుల ఆందోళనను కొంతకాలం వరకు ఆపగలిగారు. ఇలా కొంతకాలం కాలక్షేపం చేశారు. విసుగెత్తిన నిర్వాసితులు నిరాహార దీక్షకు దిగటంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేపట్టారు. రిజిస్ట్రేషన్ అయితే చేశారు కానీ, పట్టాలు ఇవ్వలేదు. దీంతో సహనం నశించిన నిర్వాసితులు విమానాశ్రయ మైనర్ ఇరిగేషన్ కాలువను తవ్వేస్తామని కార్యాచరణకు పిలుపునివ్వటంతో పట్టాలు అందజేశారు. కానీ, ఈ ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణానికి రూపాయి ఇచ్చింది లేదు. నిర్వాసితులు ఆమరణ దీక్షకు దిగుతామనడంతో మరో జీవోను తెరపైకి తెచ్చారు. ఈలోగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చి ఆ ప్రతిపాదన కూడా వెనక్కిపోయింది.

అద్దెలు ఇచ్చిందీ లేదు..

విమానాశ్రయ అభివృద్ధి కోసం ఇళ్లను వదులుకున్న నిర్వాసితులు ఇప్పుడు వేలల్లో అద్దెలు కట్టుకుంటున్నారు. అద్దె డబ్బు చెల్లించాలన్న ఒప్పందం ఉన్నా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇచ్చింది లేదు. అద్దెతో పాటు ఇళ్లు కట్టుకోవడానికి డబ్బు ఇవ్వాలని విమానాశ్రయ నిర్వాసితులు ఐదేళ్లుగా పోరాడుతున్నా కనికరం చూపలేదు. ఎన్నికలు రావటంతో మరోమారు మభ్యపెట్టడానికి జగన్ ముఖాముఖి పేరుతో నిర్వాసితులపై మరో కుట్రకు తెరతీశారు. నిర్వాసితులెవరూ జగన్‌తో సమావేశం కావటానికి ఆసక్తి చూపకపోయినా అధికార పార్టీ నేతలు సిద్ధంచేసిన పదిమందితో సమావేశం నిర్వహించనున్నారు.

విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులను కూడా ఆహ్వానించారు.

గన్నవరం రైతుల అనాసక్తి

రైతులెవరూ రాబోమని చెప్పటంతో ఈ కార్యక్రమాన్ని షెడ్యూల్ నుంచి తప్పించారు.

అపరిష్కృతంగా విమానాశ్రయ సమస్యలు

గతంలో టీడీపీ ప్రభుత్వం విమానాశ్రయ అభివృద్ధికి కృషి చేసింది. దాదాపు 700 ఎకరాలను సమీకరించి ఇచ్చింది. ఈ భూములను స్వాధీనం చేసుకున్న ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అనేక అభివృద్ధి పనులను చేపట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక విమానాశ్రయ సమస్యలన్నింటినీ గాలికొదిలేసింది. దీంతో ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మలివిడత చర్యలు చేపట్టలేకపోతోంది. ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనులు ఇప్పటివరకు పూర్తికాలేదు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున కనీసం ఒక్కరోజు కూడా సమీక్ష జరపలేదు.

హామీతుమీ

గుడివాడ టిడ్కో లబ్ధిదారుల అల్టిమేటం

- సీఎం పర్యటన నేపథ్యంలో ఎక్కడికక్కడ ధర్నాలు
- గత ఎన్నికల హామీ ఏమైందని ప్రశ్న
- నేటి సిద్ధం సభలో రుణమాఫీ హామీకి డిమాండ్
- ఎమ్మెల్యే నాని మాట నిలబెట్టుకోవాలని నినాదాలు
- జగన్ హామీ ఇచ్చేస్తారని స్థానిక నేతల కబుర్లు



సి30 బ్లాక్ వద్ద లబ్ధిదారుల నిరసన

గుడివాడ, ఏప్రిల్ 13 : సీఎం జగన్ ఆదివారం పర్యటన నేపథ్యంలో గుడివాడలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు శనివారం ధర్నాలు చేపట్టారు. టిడ్కో గృహ సముదాయాల్లోని వివిధ బ్లాకుల వద్ద పెద్దపెట్టున నినాదాలు చేశారు. పట్టణంలోని దాదాపు 12 ప్రాంతాల్లో ఆందోళనలకు దిగారు. కాలనీలో మౌలిక వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, ఎప్పటికి ఇళ్లు అప్పగిస్తారని ప్రశ్నించారు. జగన్ వస్తున్న సందర్భంలో టిడ్కో లబ్ధిదారుల నుంచి ప్రతిఘటన ఎదురవుతుండటంతో ఏం చేయాలో పాలుపోక స్థానిక అధికార పార్టీ నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

నాడు అమలుకాని హామీలు

2018లో ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా గుడివాడ వచ్చిన సీఎం జగన్ కేవలం రూపాయికే రిజిస్ట్రేషన్ చేసి, టిడ్కో ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ తర్వాత టిడ్కో రుణ విముక్తులను చేస్తామని, అవసరమైతే వన్ టైం సెటిల్‌మెంట్ చేస్తానని ఎన్నికల ప్రచారంలో భాగంగా గుడివాడ వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే కొడాలి నాని చెప్పుకొచ్చారు. ఈ క్రమంలో వన్ టైం సెటిల్‌మెంట్ కాదని, రుణమాఫీ చేస్తామని సిద్ధం సభలో ప్రకటించి వైసీపీ మేనిఫెస్టోలో పెట్టాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొడాలి నానీకి వినతిపత్రం అందజేశారు. అయితే, మాట దాటవేస్తూ రుణమాఫీ అంశాన్ని మేనిఫెస్టోలో పెట్టడం కుదరదని, జగన్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని కొడాలి నాని కవర్ చేశారు. దీనిపై లబ్ధిదారులు మండిపడ్డారు.

నేడైనా నిజమైన హామీలిస్తారా?

గత ఎన్నికల్లో గుడివాడలో అక్కాచెల్లెమ్మలకు ఉచితంగా టిడ్కో ఇళ్లు ఇస్తానని సీఎం జగన్ హామీ ఇచ్చి మోసం చేశారు. కానీ, అమలు చేయలేదు. గుడివాడలో శనివారం జరిగే సిద్ధం సభలో అయినా టిడ్కో రుణమాఫీపై ఏ మేరకు హామీ ఇస్తారోనని లబ్ధిదారులు వేచి చూస్తున్నారు. జగన్ కచ్చితంగా రుణమాఫీపై హామీ ఇస్తారని స్థానిక వైసీపీ నాయకులు మాత్రం కచ్చితంగా లబ్ధిదారులను ఏమారుస్తున్నారు.

మడమ తిప్పారు..!

అధ్వానంగా ఉన్న రోడ్లలో సీఎం పర్యటన నో..

- కేవలం జాతీయ రహదారి వెంబడే రూట్‌మ్యాప్
- గతుకులమయంగా గుడివాడ-విజయవాడ రోడ్డు
- ఆ రోడ్డు కాకుండా వేరే దారిలో యాత్ర



అధ్వానంగా విజయవాడ-గుడివాడ రహదారి

మచిలీపట్నం-ఆంధ్రజ్యోతి : సీఎం వైఎస్ జగన్ పర్యటన గుడివాడలో జాతీయ రహదారి వెంబడే కొనసాగేలా రూట్‌మ్యాప్‌ను తయారు చేశారు. గుడివాడ-విజయవాడ రహదారి అధ్వానంగా ఉండటంతో ఈ రోడ్డు వెంబడి రోడ్ షో ఏర్పాటు చేయలేదు. ఈ రహదారి వెంబడి వస్తే గన్నవరం, పెనమలూరు, పామర్రు, గుడివాడ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాలున్నాయి. ఈ రహదారిని ఐదేళ్లుగా అభివృద్ధి చేయకపోవడంతో రూట్‌మ్యాప్‌ను మార్చేశారు. కాగా, గుడివాడ, నందివాడ మండలాలకు తాగునీటిని అందించేందుకు 100 ఎకరాల్లో లింగవరం శివారు మెరకగూడెం వద్ద ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన పైలెట్ ప్రాజెక్టు అటకెక్కింది. ఆదివారం జరిగే మేమంతా సిద్ధం సభలో ఈ ప్రాజెక్టు గురించి జగన్ ఏం హామీ ఇస్తారోనని స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పరిహారం మరిచారు..!

- మిచౌంగ్ తుఫాన్ పంట నష్టపరిహారం ఏదీ?
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు

నేటి పర్యటనలో సీఎం హామీ ఇస్తారా?

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మిచౌంగ్ తుఫాన్ పంట నష్టపరిహారం నగదు జమ పరిహాసంగా మారింది. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో సంభవించిన ఈ తుఫాన్ కారణంగా రైతులు పంట నష్టపోయారు. నాలుగు నెలలుగా పంట నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం మిన్నకుండిపోయింది. సంక్రాంతి పండుగ నాటికి రైతుల ఖాతాల్లో పరిహారం సొమ్మును జమ చేస్తామని పాలకులు ఇచ్చిన హామీ నీటిమీద రాతే అయ్యింది. 'మేమంతా సిద్ధం' కార్యక్రమంలో భాగంగా సీఎం జగన్ ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. పంట నష్టరిహారంపై రైతులకు ఆయన ఏం సమాధానం చెబుతారని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వారం రోజులకుపైగా పంట నీటిలోనే మునిగి ఉండటంతో ధాన్యం మొక్కమొలిచి నష్టం పెరిగింది. 33 శాతం కంటే అధికంగా దెబ్బతిన్న వరి, ఇతర పంటల వివరాలను వ్యవసాయ, రెవెన్యూ శాఖల బృందాలు తొలుత ప్రాథమిక అంచనాలు తయారుచేశాయి. జిల్లాలో 83,462 హెక్టార్లలో వరిపంటకు నష్టం వాటిల్లినట్లు నమోదుచేశారు. వేరుశెనగ 885 హెక్టార్లలో, మొక్కజొన్న 220 హెక్టార్లలో, మినుము 315 హెక్టార్లలో, పత్తి 177 హెక్టార్లలో దెబ్బతిన్నట్టు గుర్తించి జాబితా తయారు చేశారు. రూ.141.56 కోట్లను పంట నష్టపరిహారంగా అందజేయాల్సి ఉందని ప్రాథమికంగా లెక్కలు వేశారు. 493.34 హెక్టార్లలో ఉద్యాన పంటలకు పంటనష్టం జరిగిందని రూ.1.20 కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉందని జాబితాలు తయారుచేసి నివేదిక ఇచ్చారు.

మారిన సీన్

జిల్లాలో 83,462 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్టుగా ప్రాథమిక నివేదికల్లో చూపగా, తుది పంట నష్టపరి హారం జాబితాలో 57,777 హెక్టార్లకు తగ్గించారు. వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలకు కలిపి జిల్లాలో రూ.141.56 కోట్లను పరిహారంగా ఇవ్వాలని అధికారులు ప్రాథమిక నివేదికలో చూపి, తుది జాబితాలు తయారు చేసే సమయానికి సీన్ మారింది. పరిహారం మొత్తాన్ని రూ.99 కోట్లకు కుదించారు. ప్రాథమిక అంచనాల్లో మార్పులు చేసి, అన్ని పంటలకు కలిపి 25 వేల హెక్టార్ల పరిహారాన్ని జాబితాల నుంచి తొలగించారు.



నేడు, రేపు బస్సుల్లేవ్..!

- గుడివాడ సిద్ధం సభకు 1,200 ఆర్టీసీ బస్సులు
- భీమవరం సిద్ధం సభకు మరో 1,200
- స్థానిక డిపోలవారీగా కేటాయింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆది, సోమవారాల్లో ఆర్టీసీ ప్రయాణికులు అవస్థలు పడాల్సిందే. బస్సు యాత్రలో భాగంగా ఆదివారం గుడివాడలో తలపెట్టే 'మేమంతా సిద్ధం' సభకు 1,200, సోమవారం భీమవరంలో తలపెట్టే సభకు మరో 1,200 బస్సులు అద్దెకు తీసుకున్నారు. ఈ బస్సుల్లో సింహభాగం ఎన్టీఆర్ జిల్లా నుంచి 240, కృష్ణాజిల్లా నుంచి 150 బస్సుల చొప్పున తీసుకెళ్తున్నారు. దీంతో ఈ రెండు రోజుల పాటు ప్రయాణికులకు బస్సులు పెద్దగా అందుబాటులో ఉండవు. సిటీ బస్సులనే ఎక్కువగా అద్దెకు ఇచ్చారు. రోజూ రెండు లక్షల మందికి పైగా ప్రయాణికులు విజయవాడ బస్టాండ్ మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. పీఎన్‌బీఎస్‌కు వచ్చిన వారంతా నగరంలోకి వెళ్లడానికి సిటీ బస్సులనే ఆశ్రయిస్తారు. వీరందరికీ ఈ రెండు రోజులు ఇబ్బందులు తప్పవు. ఈ పరిణామంతో ఆటోవాలాలు పండుగ చేసుకుంటున్నారు. భారీగా చార్జీ వసూలు చేస్తున్నారు.

ఉద్వేగభరితం



నిజం గెలవాలంటూ భువనేశ్వరి పదునైన ప్రసంగం

తిరువూరులో సభకు విచ్చేసిన మహిళలను ఉద్దేశించి మాట్లాడుతున్న భువనేశ్వరి

- తిరువూరులో ముగింపు సభ విజయవంతం
- మాటల తూటాలతో ప్రభుత్వంపై నిప్పులు
- భువనేశ్వరి మాటలకు దద్దరిల్లిన సభా ప్రాంగణం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/తిరువూరు) : మాటల తూటాలు.. విమర్శల అస్త్రాలు.. పదునైన ప్రసంగాలు.. తిరువూరులో శనివారం జరిగిన 'నిజం గెలవాలి' బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రసంగం ఆద్యంతం ఉద్వేగభరితంగా సాగింది. అన్న క్యాంటీన్ల నిలిపివేత.. ప్రజావేదిక కూల్చివేత.. రాజధాని అమరావతి వంటి అంశాలను ఆమె ప్రస్తావించినప్పుడు సభా ప్రాంగణంలో కూర్చున్న మహిళల నుంచి విశేష స్పందన వచ్చింది. ప్రాంగణమంతా చప్పట్లతో మార్మోగిపోయింది. వైసీపీ ప్రభుత్వంపై విమర్శలతో పాటు చంద్రబాబు పాలనలో జరిగిన అభివృద్ధిని ఆమె సోదాహరణంగా వివరించారు. విజన్-2020 పేరుతో ఐటీ రంగాన్ని రాష్ట్రానికి తీసుకురావాలని చంద్రబాబు సంకల్పిస్తే కొందరు ఎద్దేవా చేశారని, అలాంటి ఐటీ వల్లే నేడు ఎన్నో కుటుంబాలు దర్జాగా బతుకుతున్నాయన్నారు. రాజధాని అమరావతిని వైసీపీ పెద్దలు ఎలా నాశనం చేశారో చెబుతూ.. మూడు రాజధానులంటున్న ప్రబుద్ధులు చివరికి రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారని దుయ్యబట్టారు.

విజయవంతంగా..

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'నిజం గెలవాలి' కార్యక్రమం తిరువూరులో విజయవంతంగా ముగిసింది. తిరువూరు పట్టణంలో శనివారం సాయంత్రం జరిగిన ఈ సభకు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు జిల్లావ్యాప్తంగా మహిళలు భారీగా రావడంతో సుమారు 30 వేల సీటింగ్ సామర్థ్యంతో ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దీంతో పలువురు మహిళలు రోడ్డుపైనే నిలిచిపోయారు. విజయవాడ ఎంపీ అభ్యర్థి కేశినేని చిన్ని ఆధ్వర్యంలో ముగింపు సభ ఏర్పాట్లు చేశారు. తిరువూరు, నందిగామ, జగ్గయ్యపేట టీడీపీ నాయకులను సమన్వయం చేసుకుంటూ ముగింపు సభను విజయవంతం చేయడంలో సక్సెస్ అయ్యారు. సభకు అశేషంగా హాజరైన మహిళలను చూసి భువనేశ్వరి భావోద్వేగానికి గురయ్యారు.

పరామర్శలు

సభకు ముందు భువనేశ్వరి తిరువూరు నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుతో మృతిచెందిన కుంచం సుబ్బారావు, కాకర్ల విశ్వనాథం కుటుంబాలను పరామర్శించారు. అనంతరం సభా ప్రాంగణానికి చేరుకుని తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె తన ప్రసంగంలో చంద్రబాబు అరెస్టు క్రమాన్ని వివరించినప్పుడు మహిళలు కంటతడి పెట్టారు. నిజం గెలవాలి కార్యక్రమాన్ని ఏ ఉద్దేశంతో ప్రారంభించారో వివరించినప్పుడు మహిళల నుంచి భారీ స్పందన వచ్చింది. దేవాలయం లాంటి అసెంబ్లీలో తనకు జరిగిన అవమానాన్ని భువనేశ్వరి వివరించారు.



17న కోనేరు సెంటర్‌లో
చంద్రబాబు, పవన్ బహిరంగ సభ

విజయవంతం చేయాలని ప్రజలకు కొల్లు రవీంద్ర పిలుపు

- 6లో..



కాపునాడు సమావేశం వద్ద తోపులాట

బందరులో పేర్ని నాని బాధితుల సమావేశం

- ఆహ్వానం లేకున్నా సమావేశానికి వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, కాపు నాయకులు
- ఎందుకు వచ్చారని ప్రశ్నించిన నిర్వాహకులు
- వైసీపీ నేతలు, నిర్వాహకుల మధ్య ఘర్షణ
- పోలీసుల రంగప్రవేశం.. సమావేశం వాయిదా..

- 6లో..

హైస్కూల్ ప్లస్‌లలో దిగజారిన ఫలితాలు

- కృష్ణాలో ఫస్టియర్ 37, సెకండియర్ 32 శాతం ఉత్తీర్ణత
- సున్నాశాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఫస్టియర్ 4, సెకండియర్ 2

- 6లో..

బూడిద తరలింపునకు
అనుమతులిచ్చింది జగనే

▸ బూడిద, మట్టి తిన్నది వాళ్లే..నిందలు నాపై వేశారు: వసంత

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 13: "తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యే సోదరుడికి బూడిద తరలించేందుకు జగన్మోహన్‌రెడ్డి అనుమతులు ఇచ్చారు. బూడిదను దోచుకున్నది వాళ్లే నిందలు మాత్రం నాపై వేశారు." అని టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. నియోజకవర్గంలో బూడిద, మట్టి తిన్నది ఎవరో ప్రజలందరికీ తెలుసునన్నారు. శనివారం జూపూడి, కేతనకొండ, కొటికలపూడి గ్రామాల్లో నిర్వహించిన ప్రజాగళం ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ విధానాలు నచ్చక పార్టీకి దూరంగా ఉన్న సమయంలో ఇబ్రహీంపట్నంలో బూడిద మాఫియా యథావిధిగా నడిచిందన్నారు. బూడిద లోడింగ్ చేసే ఆపరేటర్ వద్దకు వెళ్లి విచారణ చేస్తే ఎవరు మాఫియా చేస్తున్నారో తెలిసిపోతుందన్నారు. బూడిద కాలుష్యంపై ఎదిరించి ప్రశ్నించకుంటే బెదిరించే వాడిదే రాజ్యమవుతుందన్నారు. ఎన్టీటీపీఎస్ బూడిద కాలుష్యంతో ప్రజల ఆయుష్షు తరిగిపోతోందన్నారు. బూడిద డబ్బులు మీకు జబ్బులు ప్రజలకా అని వసంత ప్రశ్నించారు. సంపూర్ణ మద్యపాన నిషేధం చేశాకే ఓట్లు అడుగుతానన్న సీఎం జగన్ ఆ హామీని తుంగలో తొక్కారన్నారు. కూటమి అధికారంలోకి రాగానే 70 ఎకరాల్లో ఎన్టీటీపీఎస్ చుట్టూ హరితవనం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు జంపాల సీతారామయ్య, రామినేని రాజశేఖర్, జనసేన నాయకులు పాల్గొన్నారు.



వసంతతో పాటు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావు, నాయకులు

మైలవరం సమగ్రాభివృద్ధే ధ్యేయం: వసంత

▸ గొల్లపూడిలో ఎన్నికల ప్రచారం..ఘనస్వాగతం పలికిన ప్రజలు

గొల్లపూడి, ఏప్రిల్ 13: మైలవరం నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ప్రజలకు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మైలవరం అభ్యర్థి వసంత వెంకట కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం గొల్లపూడిలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వసంతకు ప్రతి గడపలోనూ ఆత్మీయ స్వాగతం లభించింది. మహిళలు హారతులు పట్టి బ్రహ్మరథం పట్టారు. సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కూటమి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకతను వివరించారు. మే 13న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. వడ్లమూడి జగన్మోహన్‌రావు, నర్రా వాసు, గూడపాటి పద్మశేఖర్, నూతులపాటి వెంకటేశ్వరరావు, బొర్రా తిరుపతిరావు, రంగినేని నరేంద్రబాబు, నూతులపాటి జగన్మోహన్‌రావు, వడ్లమూడి చలపతిరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్‌లలో నిరాశాజనక ఫలితాలు

▸ కృష్ణాలో ఫస్టియర్ 37, సెకండియర్ 32 శాతం ఉత్తీర్ణత

▸ సున్నా శాతం ఉత్తీర్ణత పాఠశాలలు ఫస్టియర్ 4, సెకండియర్ 2

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: వైసీపీ ప్రభుత్వం వనరులు లేకుండా పాఠశాలల్లో హైస్కూల్ ప్లస్‌లను ప్రారంభించడంతో కృష్ణాజిల్లాలో ఆశించినంతగా ఫలితాలు రాలేదు. ల్యాబొరేటరీలు లేకుండా హైస్కూల్ ప్లస్ పాఠశాలలు ప్రారంభించడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని పాఠశాలల్లో జీరో శాతం ఉత్తీర్ణత వచ్చింది. జిల్లాలో 23 హైస్కూల్ ప్లస్ పాఠశాలలుండగా మొదటి సంవత్సరం 287 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తే 106 మంది ఉత్తీర్ణులయ్యారు. 37 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బంటుమిల్లి మండలం పెదతుమ్మిడి, ఘంటసాల, గూడూరు మండలం మల్లవోలు, పెడన మండలం చెన్నూరు పాఠశాలల్లో జీరో శాతం నమోదైంది. సెకండియర్ పరీక్షలకు 146 మంది హాజరు కాగా, 48 మంది ఉత్తీర్ణులై 32 శాతం నమోదైంది. 23 పాఠశాలల్లో రెండు పాఠశాలల్లో జీరో శాతం నమోదైంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు బోధించేందుకు సరిపడా లెక్చరర్లు, ల్యాబొరేటరీలు, వసతులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 25 హైస్కూల్ ప్లస్ పాఠశాలలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది.



అన్నవరంలో ఈనెల 10న వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఐకేపీ సమైక్య అధ్యక్షురాలు ధారావత్ శ్యామల, బుక్ కీపర్ కందుకూరి సుమలత (వృత్తంలో ఉన్న మహిళలు)

విధుల నుంచి ఐకేపీ
సమాఖ్య మండల అధ్యక్షురాలు, బుక్‌కీపర్ తొలగింపు

▸ అన్నవరంలో వైసీపీ ప్రచారంలో పాల్గొన్నందుకు చర్యలు

జగ్గయ్యపేట రూరల్, ఏప్రిల్ 13: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా మండలంలోని అన్నవరం గ్రామంలో వైసీపీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఐకేపీ సమాఖ్య మండల అధ్యక్షురాలు ధారావత్ శ్యామల, బుక్ కీపర్ కందుకూరి సుమలతను విధుల నుంచి తొలగించినట్లు డీఆర్డీఏ జిల్లా పీడీ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఈనెల 10న గ్రామంలో నిర్వహించిన వైసీపీ కార్యక్రమంలో శ్యామల, సుమలత పాల్గొన్నారని జగ్గయ్యపేటకు చెందిన రామకృష్ణ ఫిర్యాదు చేశారని, దానిపై సమగ్రంగా విచారణ జరిపి, వారిని తొలగించామని ఆయన తెలిపారు. ప్రస్తుత మండల ఉపాధ్యక్షురాలిగా ఉన్న సుబ్బలక్ష్మిని పదోన్నతిపై ఐకేపీ సమాఖ్య మండల అధ్యక్షురాలిగా నియమించామని తెలిపారు. అన్నవరం గ్రామంలో పనులు సజావుగా సాగేందుకు బుక్‌కీపర్‌గా అర్చన గ్రామ సంఘం వీఏవో మాధవికి అదనపు బాధ్యతలు అప్పగించామని తెలిపారు.

17న కోనేరు సెంటర్‌లో
చంద్రబాబు, పవన్ బహిరంగసభ

▸ విజయవంతం చేయాలని కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: కోనేరుసెంటర్‌లో ఈనెల 17న సాయంత్రం 5 గంటలకు నిర్వహించనున్న ప్రజాగళం బహిరంగ సభను విజయవంతం చేయాలని ప్రజలను టీడీపీ-జనసేన-బీజేపీ మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. పోతేపల్లిలో మీడియాతో కొల్లు రవీంద్ర మాట్లాడారు. బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడుతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ నాయకులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని ఆయన కోరారు.

ఏడుగురు జనసేన సమన్వయకర్తల నియామకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13: టీడీపీ, బీజేపీలతో జనసేన సమన్వయంతో పని చేసేందుకు కూటమి మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థి వల్లభనేని బాలశౌరి సూచనల మేరకు నియోజకవర్గ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు ఏడుగురు సమన్వయకర్తలను పార్టీ నియమించినట్లు జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తెలిపారు. శనివారం జనసేన అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవనిగడ్డ నియోజకవర్గానికి చిలకలపూడి పాపారావు, పెనమలూరుకు బాడిత శంకర్, పెడనకు బోనె పార్వతి, గుడివాడ అజయ్‌వర్మ, గన్నవరనాకి అక్కల గాంధీ, మచిలీపట్నం బండి రామకృష్ణ, పామర్రు పంచకర్ల సందీప్‌లను పార్టీ నియమించిందని ఆయన తెలిపారు.



గుడివాడలో వైసీపీ మైనార్టీ సీనియర్ నాయకుడు మౌలాలికి కండువా కప్పి టీడీపీలో చేర్చుకుంటున్న వెనిగండ్ల రాము



వడ్లమన్నాడులో వెనిగండ్ల రాము సమక్షంలో టీడీపీలో చేరుతున్న గరికపాటి కుటుంబం, అనుచరులు

వైసీపీకి షాక్

టీడీపీలో చేరిన గుడివాడ, మచిలీపట్నం మైనార్టీ నేతలు

ఎన్నికల్లోపు గుడివాడలో వైసీపీ ఖాళీ: వెనిగండ్ల

గుడివాడ: "వైసీపీకి కంచుకోటలైన లింగవరం, జొన్నపాడు, వడ్లమన్నాడు, గుడివాడలో ఆ పార్టీ కీలక నేతలు టీడీపీలో చేరుతున్నారు. ఎన్నికల్లోపు గుడివాడలో వైసీపీ ఖాళీ అవుతుంది. నిబద్ధత గల మైనార్టీ సీనియర్ నాయకుడు షేక్ మౌలాలి పార్టీలో చేరడం శుభపరిణామం." అని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 11వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మౌలాలిని కండువా కప్పి ఆయన టీడీపీలో చేర్చుకున్నారు. నాని పచ్చి మోసగాడు. అవసరం తీరాక వదిలేయడంలో ఆరితేరిన వ్యక్తి అని రాము ఆగ్రహం వ్యక్తంచేశారు. నియోజకవర్గ ప్రజలు ఇరవై ఏళ్లు మోసపోయారని, ఇక మోసపోరని, రాజకీయ నాయకులు, ప్రజలు కూటమికి పట్టంకట్టాలని నిర్ణయానికి వచ్చారని రాము తెలిపారు.

వైసీపీలో భజన కొట్టే వారికే విలువ: మౌలాలి

పదేళ్ల నుంచి వైసీపీలో పనిచేస్తున్నానని, మైనార్టీల అభ్యున్నతికి ఎంపీ బాలశౌరి కృషి చేశారని మౌలాలి తెలిపారు. అంజుమన్ భవన నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.20 లక్షలు సమకూర్చారన్నారు. షాదీఖానా నిర్మాణానికి రూ.కోటి సమకూరుస్తానని హామీ ఇచ్చారన్నారు. వైసీపీ వ్యవహారాలన్నీ నాని ముఖ్య అనుచరుడు శశి కనుసన్నల్లోనే జరుగుతాయని, ఆ పార్టీలో భజన కొట్టేవారికి విలువనిస్తారని ఆరోపించారు. వైసీపీలో ఎంతలా కష్టపడ్డానో వెనిగండ్ల గెలుపునకు రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, టీడీపీ నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, షేక్ ఇబ్రహీం, షేక్ జానీ, సయ్యద్ జబీన్, షేక్ ముజాహిద్, కరీముల్లా, పట్టపు చిన్నా పాల్గొన్నారు.

వడ్లమన్నాడులో టీడీపీలో చేరిన
గరికపాటి కుటుంబం, అనుచరులు

గుడ్లవల్లేరు: వడ్లమన్నాడులో వైసీపీ సీనియర్ నాయకుడు గరికపాటి గోపాలస్వామి(గోపి), వైస్ సర్పంచ్ గరికపాటి రాంబాబు, వారి సోదరుల కుటుంబసభ్యులు, అనుచరులు పెద్ద సంఖ్యలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి వెనిగండ్ల రాము కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శేరికల్వపూడి, జొన్నపాడు, వడ్లమన్నాడు ఇలా రోజుకో ఊరు నుంచి వైసీపీని నాయకులు వీడుతున్నారని ఆయన అన్నారు. ఈసారి గుడివాడలో టీడీపీ జెండా రెపరెపలాడుతుందని రాము అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, శాయన పుష్పావతి, బెల్లంకొండ ఏడుకొండలు, కొడాలి రామరాజు, పెన్నేరు రమేష్, జంగం మోహనరావు, తూము పద్మజ, పి.కన్నెభాస్కరరావు, సత్తార్, పామర్తి సత్తిబాబు, ఈడే కృష్ణ, మన్నెం నరసింహారావు, పెద్దిరాజు, వీరన్న పాల్గొన్నారు.



షేక్ జలీల్‌ను టీడీపీలో చేర్చుకుంటున్న చంద్రబాబు

పేర్ని అనుచరుడు జలీల్ టీడీపీలోకి..

మచిలీపట్నం టౌన్: పేర్ని నాని కన్నా ముందునుంచి వైసీపీలో ఉన్న మైనారిటీ నాయకుడు షేక్ జలీల్ మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కొల్లు రవీంద్ర ఆధ్వర్యంలో చంద్రబాబు సమక్షంలో పాతికమంది మైనార్టీ నాయకులతో కలిసి శనివారం టీడీపీలో చేరారు. జలీల్‌కు చంద్రబాబు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ ప్రారంభంలో వైసీపీ కృష్ణాజిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా పనిచేసిన జలీల్ ప్రస్తుతం జిల్లా వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా ఉన్నారు. జలీల్ మచిలీపట్నంలో రాజకీయంగా పట్టున్న నాయకుడు. చాలాకాలంగా పేర్ని నాని వెంట ఉంటున్నారు. ఆయనతో పాటు నజీర్ అహ్మద్, మా అబ్బాస్, బషీర్ అహమ్మద్, అప్సర ఐస్‌క్రీం మహమ్మద్ అలీ, ఆరిఫ్, ఆదిసుమన్, అమీర్, ఖదీర్, ఖాదర్ పార్టీలో చేరారు.

పేర్ని నానివి కల్లబొల్లి మాటలు: షేక్ జలీల్

"పేర్ని నానివి కల్లబొల్లి మాటలు. ఆయన మాటలు నమ్మి చాలామంది మోసపోయి ఆస్తులను పోగొట్టుకున్నారు. ముందు నుంచి పార్టీలో ఉన్నా నాకు రాజకీయంగా ప్రాధాన్యమిస్తామని ఇవ్వలేదు. అన్నీ మౌనంగా భరించాను. భవిష్యత్తులో బందరు అభివృద్ధి చెందాలంటే కొల్లు రవీంద్ర వెంట ఉండటం మంచిదని టీడీపీలో చేరాను" అని జలీల్ తెలిపారు.

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన
వైసీపీ మొవ్వ నేతలు, కార్యకర్తలు



మండవ రత్నగిరిరావుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చంద్రబాబు

కూచిపూడి: ఏఎంసీ మాజీ చైర్మన్, వైసీపీ నేత, మొవ్వ మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, మొవ్వ గ్రామానికి చెందిన మండవ రత్నగిరిరావుతోపాటు పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి చేరారు. వీరందరికీ కండువా కప్పి చంద్ర బాబు పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ పామర్రు నియోజకవర్గ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా, నన్నపనేని వీరేంద్ర, తాతినేని పూర్ణచం ద్రరావు, మండవ వెంకటేశ్వర రావు, మండవ శ్రీకృష్ణ, ఈడే నాగే శ్వరరావు, లింగమనేని రామలింగేశ్వరరావు ఉన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేసిన దుర్మార్గుడు జగన్

తిరువూరు 'నిజం గెలవాలి' బహిరంగ సభలో కేశినేని చిన్ని విమర్శ



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

తిరువూరు, ఏప్రిల్ 13: "ఒక్క చాన్స్ అంటూ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన దుర్మార్గుడు. ప్రజలు మరో అవకాశం ఇవ్వరని జగన్‌కు తెలుసు. ఆ దుర్మార్గుడికి ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్ర ప్రజలు బాధపడుతున్నారు. ఆ పొరపాటును సరిదిద్దుకునేందుకు వారంతా ఎదురుచూస్తున్నారు." అని టీడీపీ-జనసేన-బీజేపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. శనివారం పట్టణంలో నారా భువనేశ్వరి పాల్గొన్న నిజం గెలవాలి బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు నిజం, జగన్మోహనరెడ్డి అబద్ధం అన్నారు. ఈ నియోజకవర్గంలో భువనేశ్వరి రెండు రోజులు పర్యటించటం అదృష్టమన్నారు. నిజాయితీపరుడైన చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడంతో 203 మంది టీడీపీ కార్యకర్తలు మరణిస్తే, వారి కుటుంబాలను భువనమ్మ పరామర్శించారని, వారికి అండగా ఉంటానని భరోసా కల్పించారని అన్నారు. రాష్ట్రంలో ఎటువంటి ఇబ్బంది వచ్చినా తక్షణం ఆదుకునేది ఎన్టీఆర్ ట్రస్టు ఒక్కటేనని అటువంటి ట్రస్టును నడుపుతున్న మహోన్నత వ్యక్తి భువనమ్మ అని పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల గెలుపుతోనే నిజం గెలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి అభ్యర్థుల విజయానికి టీడీపీ నాయకులు కార్యకర్తలు పనిచేయాలని ఎన్టీఆర్‌జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ పిలుపునిచ్చారు. చంద్రబాబుపై పెట్టిన స్కిల్ డవలప్‌మెంట్ కేసులో ఆధారాలు చూపించలేక ఫైళ్లు తగలబెట్టారని అన్నారు. జనసేన తిరువూరు ఇన్‌చార్జి మనుబోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల సంగ్రామంలో అవినీతి రాక్షస పాలనను అంతమొందించేందుకు జనసైనికులంతా పని చెయ్యాలన్నారు. కూటమి తిరువూరు అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన తిరువూరులో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ఈ ప్రాంత ప్రజలు తాగునీరు లేక కన్నీరు తాగుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కూటమి విజయంతో అమరావతి రాజదాని అవుతుందని తిరువూరు ప్రాంతంలో విద్యా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తాను కృషి చేయడంతో పాటుగా, సాంకేతిక ఉన్నత విద్యా అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సభల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'నిజం గెలవాలి'తో మృతుల కుటుంబాలకు ఆత్మస్థైర్యం: పంచుమర్తి అనురాధ

చంద్రబాబు అరెస్టును తట్టుకోలేకి మృతి చెందిన కార్యకర్తల కుటుంబాలను తన కుటుంబాలుగా భావించి వారిని ఓదార్చి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు భువనేశ్వరి నిజం గెలవాలి యాత్ర చేశారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. ఈ యాత్ర బాధిత కుటుంబాలతో పాటుగా ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచిందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించకుండా మద్యం గంజాయికి యువతను బానిసలుగా చేసిందని ఆమె ఆరోపించారు. మహిళలను మహాశక్తులుగా మార్చి కష్టాల్లో ఉన్న పార్టీని కార్యకర్తల్ని కాపాడుకునేందుకు భువనేశ్వరి చేపట్టిన యాత్ర నారీలోకానికి స్ఫూర్తిదాయకం అని తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో మృతిచెందిన కార్యకర్తల కుంటుంబాలను పరామర్శించి, ఆదుకున్న భువనేశ్వరికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కాపునాడు సమావేశం వద్ద తోపులాట

▸ బందరు సువర్ణ కల్యాణ మండపంలో కాపునాడు పేరుతో పేర్ని నాని బాధితుల సమావేశం

▸ ఆహ్వానం లేకున్నా సమావేశానికి వెళ్లిన వైసీపీ కార్పొరేటర్లు, కాపు నాయకులు

▸ ఆహ్వానించకుండా వచ్చారేంటని ప్రశ్నించి, గేటు వద్దే అడ్డుకున్న నిర్వాహకులు

▸ వైసీపీ నేతలు, నిర్వాహకుల మధ్య తోపులాట..పోలీసుల రంగప్రవేశం..సమావేశం వాయిదా



సువర్ణ కల్యాణమండపం వద్ద గుమికూడిన కాపు సంఘం నాయకులు

మచిలీపట్నం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కుతోంది. బందరు సువర్ణ కల్యాణ మండపం వద్ద నిర్వహిస్తున్న కాపునాడు సమావేశం వద్దకు వచ్చిన వైసీపీ కాపు నాయకులకు, నిర్వాహకులకు మధ్య తోపులాట జరిగింది. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పేర్ని నాని బాధితులు, జనసేన, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు కాపునాడు పేరుతో పరాసుపేట సెంటరులోని సువర్ణ కల్యాణ మండపంలో శనివారం రాత్రి సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. వైసీపీకి చెందిన కాపు నాయకులను, కార్పొరేటర్లను ఆహ్వానించలేదు. ఆహ్వానం లేకున్నా, వైసీపీ కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, శీలం బాబ్జీ, పర్ణం సతీష్, పలువురు సర్పంచ్‌లు ఈ సమావేశానికి వచ్చారు. దీంతో సమావేశం ఏర్పాటుచేసిన చలమలశెట్టి జస్వంత్, రాజా, చలమలశెట్టి ఆదికిరణ్ తదితరులు మిమ్మల్ని పిలవలేదు కదా.. మీరెందుకు వచ్చారంటూ గేటువద్దనే ప్రశ్నించి లోపలకు అనుమతించలేదు. వాట్సాప్ గ్రూపులో వచ్చిన సమాచారంతో సమావేశానికి వచ్చామని వైసీపీ నాయకులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య వాగ్వివాదం జరిగి తోపులాటకు దారితీసింది. వైసీపీ నాయకులు ఈసమావేశం జరగకుండా నిలిపివేసేలా మరింతగా నిర్వాహకులతో వాగ్వివాదాన్ని పొడిగించారు. వైసీపీ నాయకులంతా రోడ్డుకు ఇటు వైపునకు వచ్చేయాలని, ఈ సమావేశం ఎలా నిర్వహిస్తారో చూద్దామని వైసీపీ కార్పొరేటర్లు చెప్పడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి వైసీపీ నాయకులను ఈ సమావేశానికి ఆహ్వానించలేదని నిర్వాహకులు చెబుతున్నారని, మీరు వచ్చి గలాటా చేయడం మంచి పద్ధతి కాదని చెప్పారు. సమావేశానికి నిర్వాహకులు అనుమతులు తీసుకున్నారా లేదా అని వైసీపీ నాయకులు ఆరా తీయడంతో పోలీసులు తీసుకున్నారని చెప్పారు. పోలీసులు సూచనలతో వైసీపీ నాయకులు వెళ్లిపోయారు. వైసీపీ నాయకులు వెళ్లిపోయాక సమావేశం నిర్వహించకుండానే నిర్వాహకులు వాయిదా వేశారు.

పేర్ని వ్యతిరేక వర్గీయుల నేతృత్వంలో..

ఐదేళ్లుగా ఎమ్మెల్యే పేర్ని నాని వైఖరి కారణంగా భూములు, ఇళ్లస్థలాల వివాదాలు, ఇతరత్రా కారణాలతో పోలీస్ కేసుల్లో బాధితులుగా మారి ఇబ్బందుల పాలైన వారంతా కాపునాడు పేరుతో ఈ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. జనసేన, టీడీపీ, కాంగ్రెస్, బీజేపీలోని కాపు నాయకులంతా హాజరై ఐదేళ్లలో పేర్ని నాని కారణంగా తీవ్ర ఇబ్బందుల పాలైన 50 మందితో వారు పడిన ఇక్కట్లను, ఆర్థికంగా దెబ్బతీసిన అంశాలను చెప్పించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పేర్నినాని తన వర్గానికి చెందిన కాపు నాయకులను అక్కడకు పంపి సమావేశం జరగకుండా రసాభాస చేశారని ఆ సామాజికవర్గం నాయకులు చెప్పుకొంటున్నారు.

దోషరహితంగా ఈవీఎంల కేటాయింపు

▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు



గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపులను పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 13: తొలి విడత ర్యాండెమైజేషన్ ద్వారా పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ సజావుగా, దోషరహితంగా జరిగిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. ర్యాండెమైజేషన్ ప్రక్రియ ఆధారంగా గొల్లపూడి ఈవీఎం గోదాము వద్ద పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కాగా, శనివారం కూడా ఇది కొనసాగింది. జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తదితరులతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా ఆర్వోలు, సహాయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాలకు అనుసంధానమైన ఈవీఎంలను వేరుచేసి ప్రత్యేక నెంబరింగ్ ఇవ్వడం, స్కానింగ్ చేయడం, బాక్సింగ్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లకు ట్రాన్స్‌పోర్టింగ్, ఇలా ప్రతి దశలోను అప్రమత్తంగా వ్యవహరించామని తెలిపారు. మొత్తం 1,781 పోలింగ్ స్టేషన్లకు 20 శాతం రిజర్వ్‌తో కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, 30 శాతం రిజర్వ్‌తో వీవీ ప్యాట్లను అందుబాటులో ఉంచుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీవో, తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీశంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి, తిరువూరు ఆర్డీవో కె.మాధవి, నందిగామ ఆర్డీవో ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్వో జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

1,216 ఫిర్యాదుల పరిష్కారం: దిల్లీరావు

కృష్ణలంక, ఏప్రిల్ 13: ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఓటర్ హెల్ప్‌లైన్, నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్(ఎన్‌జీఎస్‌పీ) మార్గాల ద్వారా 1,250 ఫిర్యాదులు రాగా 1,216 ఫిర్యాదుల పరిష్కారం పూర్తైందని, మిగిలినవి పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ దిల్లీరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్ హెల్ప్‌లైన్ (1950) ద్వారా 195 ఫిర్యాదులు రాగా 195 పరిష్కారమయ్యాయన్నారు. ఎన్‌జీఎస్‌పీ ద్వారా 384 ఫిర్యాదులు రాగా 374 పరిష్కరించినట్లు తెలిపారు. వాట్సాప్ నెంబరు 9154970454 ద్వారా 29 ఫిర్యాదులు రాగా 26, కాల్‌సెంటర్ (0866-2570051) ద్వారా 22 రాగా 22 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు. కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎంఎస్) ద్వారా 54 ఫిర్యాదులు రాగా 46 పరిష్కరించినట్లు వెల్లడించారు. 62 ప్రతికూల వార్తలకు సంబంధించి ఫిర్యాదులొస్తే 56 పరిష్కరించినట్లు కలెక్టర్ తెలిపారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

● పీవో, ఏపీవోలతో కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక: పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడంలో ప్రిసైడింగ్ అధికారులు(పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో) కీలకమని, మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను సద్వినియోగం చేసుకుని, సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు సూచించారు. శనివారం నగరంలోని పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పీవో, ఏపీవోల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈనెల 13, 14 తేదీల్లో ఇచ్చే శిక్షణను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని, ఏ సందేహమున్నా మాస్టర్ ట్రైనర్ ద్వారా నివృత్తి చేసుకోవాలని సూచించారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేకంగా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్వో కిరణ్మయి పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 3.96

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 : క్రమశిక్షణతో ఎన్నికల నియమనిబంధనలు పాటిస్తూ నిర్భయంగా ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పని చేయాలని నియోజకవర్గ స్పెషల్ లీగల్ టీం సభ్యుడు వేణు గుంటూరు తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ బాపులపాడు మండల కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమా వేశంలో టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, మజ్జిగ నాగరాజు, గార్లపాటి రాజేశ్వరరావు, దయాల రాజీవ్‌కాంత్, నక్కా నాగరాజు, కొండపల్లి వెంకన్న, పొట్లూరి ఫణి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వేలేరు అండర్ పాస్ పనులు వేగవంతం చేయాలి

రైల్వే ఏడీఆర్ఎం ఎడ్విన్



ఆర్వోబీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న రైల్వే ఏడీఆర్ఎం ఎడ్విన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 13 : విజయవాడ-విశాఖపట్నం రైల్వే మార్గంలోని వేలేరు వద్ద గల ఎల్‌సీ(లెవెల్ క్రాసింగ్)నెం 334 వద్ద గల రైల్వే గేటు నిరవధికంగా మూసివేయడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులెదుర్కొంటున్నారని అవిర్నేని కార్తీక్‌తో కలిసి స్థానికులు రైల్వే అధికారులకు శుక్రవారం విజ్ఞప్తి చేశారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రైల్వే ఏడీఆర్ఎం ఎడ్విన్, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ ఉపాధ్యాయతో కలిసి శనివారం వేలేరు రైల్వే గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఆర్వోబీ (రైల్వే అండర్ బ్రిడ్జి) పనులు త్వరితగిన మొదలుపెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజనీర్ (రైల్వే) సంతోష్ కుమార్, స్థానిక ప్రజలు కాంతారావు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు మధ్య గన్నవరం చేరిన ఈవీఎంలు



ఈవీఎంలను పరిశీలిస్తున్న జేసీ గీతాంజలి శర్మ

గన్నవరం, ఏప్రిల్ 13 : పటిష్ట బందోబస్తు మధ్య గన్నవరానికి ఈవీఎంలు వచ్చినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. శనివారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌లో 306 పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఈవీఎంలను భద్రపరిచారు. అన్ని రాజకీయ పార్టీల సమక్షంలో వాహనాల సీల్‌ను ఓపెన్ చేసి 37 పెట్టెల్లో తీసుకొచ్చిన 267 బ్యాలెట్ యూనిట్లు, 267 కంట్రోల్ యూనిట్లు, 297 వీవీపీఏటీలను స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. టీడీపీ, కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, నాదెండ్ల మోహన్, మిరప నాగేశ్వర రావు, కంభంపాటి శ్రీనివాసరావు, తంగిరాల శ్రీనివా సరావు, తహసీల్దార్ పవన్‌కుమార్, ఎలక్షన్ డీటీ గోపాల్‌రెడ్డి, ఆర్ఐ ఉదయ్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేనివ్యక్తి ఆత్మహత్యాయత్నం

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 13 : స్థానిక నూజివీడు రైల్వే స్టేషన్‌లో శనివారం గూడ్స్ రైలు కిందపడి బాపులపాడుకు చెందిన బత్తుల శివ ప్రసాద్ (30) ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఏలూరు రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మతిస్థిమితంలేని శివప్రసాద్ విజయ వాడ వైపు నుంచి ఏలూరు వెళ్తున్న గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. రెండు కాళ్లు తెగి పోయాయి. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అభివృద్ధి, సంక్షేమం బాబు ధ్యేయం

పెనమలూరు కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్



టీడీపీలో చేరిన తాడిగడప వైసీపీ కార్యకర్తలతో బోడె ప్రసాద్

వేల్పూరు (కంకిపాడు), ఏప్రిల్ 13 : అవినీతి, అక్రమాలు జగన్ రెడ్డి పాలన అయితే అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబు నాయుడు ధ్యేయమని పెనమలూరు నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండలంలోని వేల్పూరులో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం అమలు కావాలన్నా.. యువత భవిత బాగుపడాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, అన్నే ధనయ్య, కొణిజేటి రాజాబాబు, కరుణాకర్, సుదిమళ్ల రవీంద్ర, మద్దాలి రామచంద్రరావు, జనసేననాయకులు ముప్పా రాజా, సుంకర శివ, నాగశ్రీ, పచ్చిపాల శేఖర్ పాల్గొన్నారు.

తాడిగడపను అభివృద్ధి చేసుకుందాం

పెనమలూరు : సైకో పాలనలో అభివృద్ధికి నోచుకోని తాడిగడప మునిసిపాలిటీని టీడీపీ కూటమి ప్రభుత్వంలో సమగ్రంగా అభివృద్ధి చేసుకుందామని కూటమి అభ్యర్థి బోడె ప్రసాద్ ఇరు పార్టీ శ్రేణులకు తెలిపారు. శనివారం తాడిగడపకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియంత అరాచక పాలనపై విసుగు చెందిన వైసీపీ శ్రేణులు టీడీపీ జనసేన పార్టీల వైపు చూస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జాన్‌సైదా, రబ్బానీ, సుభానీ, షాహెద్, రియాజ్, ఫయాజ్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం



ఆరుగొలనులో జరిగిన బీసీల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న దొంతు చిన్నా

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 13 : టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి అండగా నిలిచిన బీసీల సాధికారతే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన ఘనత టీడీపీదని రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, బీసీ సెల్ జిల్లా నాయకుడు వీరంకి గురుమూర్తి అన్నారు. ఆరుగొలను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఓగిరాల, తిప్పనగుంట, చిరివాడ గ్రామాల బీసీల ఆత్మీయ సమ్మేళనం శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దయాల రాజేశ్వరరావు, బేతా శేషకుమార్, వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివఅప్పారావు, గండి కృష్ణారావు, దన్నే దుర్గారావు, అచ్చన వెంకటేశ్వరరావు, అన్నే అనిల్‌కుమార్, మొవ్వా వెంకటేశ్వర రావు, రామారావు, బ్రహ్మాజీ, మద్దాల వెంకటేశ్వరరావు, శివశంకర్, చెన్నుబోయిన నాగరాజు, రాజులపాటి శ్రీనివాసరావు, జనసేన నాయకులు వీరం వినయ్‌కుమార్, సాదరబోయిన సురేష్, అలవాల దుర్గారావు పాల్గొన్నారు.

తెంపల్లిలో..

గన్నవరం : బీసీలకు రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించింది టీడీపీనేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న అన్నారు. మండలంలోని తెంపల్లిలో జయహో బీసీ సమావేశం శనివారం రాత్రి గ్రామపార్టీ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుధాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా దొంతు చిన్న మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలను మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా చేసి మంచి భవిష్యత్‌ను కల్పించిందన్నారు. కూటమి అభ్యర్థులు యార్లగడ్డ వెంకట్రావు, వల్లభనేని బాలశౌరిలను గెలిపించుకోవాలన్నారు. బీసీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మోదుగుమూడి సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వరరావు, పలగాని వేణు, బుస్సే నాగ ప్రసాద్, చిక్కవరపు నాగమణి, గోపి, నాగరాజు, నాగార్జున, జాస్తి వెంకటేశ్వరరావు, జూపల్లి సురేష్, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, మండవ అన్వేష్,

పోలింగ్ నిర్వహణపై అవగాహన



శిక్షణలో నాలుగు మండలాల పీవోలు, ఏపీవోలు

ఉంగుటూరు, ఏప్రిల్ 13 : ఎన్నికలు సజావుగా, సక్రమంగా నిర్వహించటంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర కీలకమైందని, పోలింగ్ నిర్వహణ ప్రక్రి య, పూర్తిచేయాల్సిన రిపోర్టులు, ఈవీఎంలు, వీవీప్యాట్లకు ఎలా కనెక్ట్ చేయాలి అనే అంశాలపై పీవోలు, ఏపీవోలకు స్పష్టమైన అవ గాహన వుండాలని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలా ల తహసీల్దార్లు, అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్లు అన్నారు. గన్నవరం నియో జకవర్గ పరిధిలోని సుమారు 500మంది పీవో, ఏపీవోలకు నాలుగు మండలాల ఏఈఆర్‌వోల ఆధ్వర్యంలో 2024సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై శనివారం తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో నాలుగు మండలాల ఏఈఆర్‌వోలు పవన్ కుమార్, జేవీ సుబ్బారావు, ఏ.శ్రీనివాస్, కె.జాహ్నవి, రిసోర్స్ పర్సన్లు, సెక్టోరల్ ఆఫీసర్లు, పీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

● ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ఎన్నికల్లో ఓటర్లు వేసే ప్రతి ఓటూ ఎంతో కీలకమైనదని, సామాన్యుడితో పాటు పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు కూడా తమ ఓటు హక్కును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఉంగుటూరు తహసీల్దార్ జేవీ సుబ్బారావు అన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై సెక్టోరల్ అధికారులకు తేలప్రోలులోని ఉషారామాలో శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు

గన్నవరం, ఏప్రిల్ 13 : నీతివంతమైన రాజకీయాల కోసం కాంగ్రెస్, సీపీఐ మద్దతుతో ఇండియా కూటమి బలపరిచిన సీపీఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు గెలుపునకు కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం మూడు పార్టీల సమా వేశం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలో రాజకీయ పరిణామాలు శరవేగంగా మారతాయన్నారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తుల పరం అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వింతా సంజీవరెడ్డి మాట్లాడుతూ, బీజేపీ స్వార్థ రాజకీయంతో ప్రత్యర్థి పార్టీల అకౌంట్లను సీజ్ చేస్తున్నారన్నారు. పెద్దు వెంకటరత్నం, ఎం.హరిబాబు, టీవీ లక్ష్మణ స్వామి, మల్లంపల్లి ఆంజనేయులు, అనుమోలు వెంక టేశ్వరరావు, మీరాఖాన్, పెద్దువాసుదేవరావు, కాట్రగడ్డ రామ చంద్రజోషి, శనగల సుబ్బారెడ్డి, గణేష్‌బాబు, గోవిందు, నాగబాబు, సీపీఎం అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాబు పాలనలో గ్రామాల అభివృద్ధి



ప్రొద్దుటూరులో ప్రచారం చేస్తున్న బోడె వెంకట్రామ్

పెనమలూరు, ఏప్రిల్ 13 : బాబు పాలనలో గ్రామాల అభివృద్ధి జరిగిందని, వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలను బోడె హేమ కోరారు. యనమలకుదురు భగత్ సింగ్‌నగర్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించి, ఉమ్మడి మేనిఫెస్టోలోని అంశాలను ఇంటింటికి వివరించారు. ఆమె వెంట అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాస్, శొంఠి శివరాంప్రసాద్, బలగం నాగరాజు, మల్లంపాటి విజయలక్ష్మి, బట్టు సరస్వతి, తమ్ము అశోక్, బెజవాడ వెంకటేష్, కందుల శివరాం, వెలగపూడి రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి హేయమైన చర్య

ప్రొద్దుటూరు (కంకిపాడు) : దళితులను అడ్డుపెట్టుకొని అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దళితులపై దాడులు చేయడం హేయమైన చర్య అని బోడె ప్రసాద్ కుమారుడు వెంకట్రామ్ అన్నారు. ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన బాబూ ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రొద్దుటూరుకు చెందిన అధికార పార్టీ నాయకులు గ్రామానికి చెందిన ఒక దళితుడిపై దాడికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో వి. పావన మూర్తి, వై. ఫణి, ఈ కోటేశ్వరరావు, టి. సతీష్, ఈ స్టాలిన్, ఈ శ్రీనివాసరావు, సీహెచ్ రవి రాజ, సీహెచ్ అభి పాల్గొన్నారు.

ముమ్మరంగా ఇంటింటి ప్రచారం

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి గాడినపడాలంటే టీడీపీతోనే సాధ్యమని పార్టీ నాయకులు చిరుమామిళ్ల సూర్యం, యార్లగడ్డ సతీష్ అన్నారు. తిప్పగుంట, పెరికీడు, మల్లవల్లి, గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ కూటమి ద్వారా ప్రజలకు అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. తిప్పనగుంటలో పార్టీ నాయకులు దయాల రాజేశ్వరరావు, మాదాల శ్రీనివాసరావు, అట్లూరి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. మల్లవల్లి బీసీ కాలనీలో ప్రచారం చేస్తున్న యార్లగడ్డ సతీష్, లక్ష్మి దంపతులకు స్థానికులు గొర్రెపిల్లను బహుకరించారు. ఈ కార్యక్రమంలో యనమదల వెంకయ్యారావు, షేక్ జాన్‌బాషా, అక్కినేని కృష్ణాజీ, ధర్మరాజు పాల్గొన్నారు. పెరికీడులో రాజులపాటి శ్రీనివాసరావు, దావులూరి సాంబశివరావు, శింగవరపు దుర్గాప్రసాద్, బండారు ప్రసన్న పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి

కలిసికట్టుగా కృషి చేద్దాం

జనసేన నేతలు బండి రామకృష్ణ, ముప్పా రాజా, తాతపూడి గణేష్

పెనమలూరు, ఏప్రిల్ 13 : రాబోయే ఎన్నికల్లో బందరు పార్లమెంటు పరిధిలోని కూటమి అభ్యర్థుల విజయానికి సర్వశక్తులూ ఒడ్డి కృషి చేయాలని మచిలీపట్నం జనసేన ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పెనమలూరు ఇన్‌చార్జి ముప్పారాజా, తాడిగడప అధ్యక్షుడు తాతపూడి గణేష్ పేర్కొన్నారు. శనివారం తాడిగడప జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెనమలూరు నియోజకవర్గానికి ఎన్నికల నిర్వహణ బాధ్యతలను బాడిత శంకర్‌కు, ఎన్నికల నిర్వహణ కమిటీ కార్యదర్శిగా గణేష్‌కు, బందరు పార్లమెంటు ఎన్నికలకు నిర్వహణ కమిటీ కార్యదర్శిగా రామకృష్ణకు అప్పగించారని తెలిపారు. నియోజకవర్గాల్లో ఇంకా ఎవరి మధ్యనయినా విభేదాలున్న పక్షంలో వాటిని సామరస్యంగా పరిష్కరించుకొని కుటుంబంలా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. టీడీపీ సీనియర్ నాయకులు వెలగపూడి శంకరబాబును సమావేశంలో సన్మానించారు. కార్యక్రమంలో షేక్ బుజ్జి, దోనేపూడి రవికిరణ్, శొంఠి శివరామ్‌ప్రసాద్, వీరంకి కుటుంబరావు, అంగిరేకుల మురళి, అక్కుల మోహన్‌రావు, బోనీ పార్వతి, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్‌వర్మ, ఆదినారాయణ, బొప్పన ప్రసాద్, కోటయ్య, డాక్టర్ కార్తికేయ, కరిమికొండ సురేష్, వడ్డీ జీవ, చెన్నా గాంధీ, గోళ్ల శ్రీనివాస్, గంధం సురేష్, తిరుమలశెట్టి సుధీర్, గరికపాటి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

5 కుటుంబాలు టీడీపీలో చేరిక



పెరికీడులో పార్టీలో చేరిన కుటుంబాలతో యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 13 : పేదలకు సంక్షేమ ఫలాలు సకాలంలో అందాలన్నా, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్నా టీడీపీతోనే సాధ్యమని నమ్మిన ప్రజలు పార్టీలో చేరుతున్నారని గన్నవరం టీడీపీ కూటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. పెరికీడు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపాటి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 5 కుటుంబాల వారు శనివారం టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన కొత్తూరు భరత్, కొత్తూరు శివకృష్ణ, కొత్తూరు రవికుమార్, మరీదు రమేష్ తదితరులకు యార్లగడ్డ టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో గుండపనేని ఉమా వరప్రసాద్, గొట్టాపు ప్రవీణ్, పోతన సురేష్, కొత్తూరి ఆంజనేయులుపాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	264
చికెన్ స్కిన్‌లెస్	274

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ.3.96

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్సీ లక్ష్మణరావు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 : రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సి బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అన్నారు. ప్రమాదంలో రాజ్యాంగం - నేటి కర్తవ్యం అనే అంశంపై శనివారం ఈశ్వర్ రెసిడెన్సీలో జరిగిన సదస్సులో లక్ష్మణరావు మాట్లాడారు. ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, లౌకికవాదం, సామాజిక న్యాయం పూర్తిగా ధ్వంస మవుతున్నాయన్నారు. రాజ్యాంగాన్ని ఉల్లంఘన చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకో వాలన్నారు. పాలకులు రాజ్యాంగంపై విశ్వాసం కలిగి ఉండాలన్నారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సిహెచ్. రాజేష్ అధ్యక్షతన జరిగిన సదస్సులో పట్టణ పౌర సంక్షేమ సంఘ నాయకుడు కొడాలి శర్మ, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్, ఆలిండియా లాయర్స్ అసోసియేషన్ నాయకుడు ఆర్. వెంకట్రావు, సీఐటీయూ నేత బి. సుబ్రహ్మణ్యం, కేవీపీఎస్ పట్టణ అధ్యక్షుడు మిరియాల జెనర్జీ, కార్యదర్శి వి.రాజు తదితరులు పాల్గొన్నారు


పోతేపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ అభ్యర్థి కొల్లు రవీంద్ర


చేవేంద్ర రోడ్‌షోలో బాలశౌరి, కాగిత కృష్ణప్రసాద్


తుమ్మలపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న వెనిగండ్ల రాము

అరాచక పాలన అంతానికే కూటమి కృషి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 13 : టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు వస్తున్న ప్రజాదరణ చూసి వైసీపీ నాయకులకు వణుకుపుడుతోందని, రానున్న ఎన్నికల్లో జిల్లాలో ఏడు సీట్లు గెలుచుకోవడం ఖాయమని మాజీ మంత్రి, మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం పోతేపల్లి, మచిలీపట్నం మూడో డివిజన్‌లో కొల్లు రవీంద్రతో పాటు బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ, తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, రూరల్ పార్టీ అధ్యక్షుడు కుంచే నాని, తలారి సోమశేఖర్ తదితరులు విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను అందజేశారు. కార్మికులు, కర్షకులు కొల్లు రవీంద్రకు తమ సమస్యలను వినిపించారు. తాగునీరు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తామని కొల్లు రవీంద్ర హామీ ఇచ్చారు.

మద్యనిషేధం హామీ నెరవేర్చని జగన్

మద్యపాన నిషేధం హామీని నెరవేర్చని సీఎం జగన్‌రెడ్డి పాలనకు చరమగీతం పాడాలని తెలుగు మహిళలు పిలుపునిచ్చారు. దేవరపల్లి అనిత పాలపర్తి పద్మ, మద్దాల లక్ష్మీ నాంచారమ్మ తదితరులు శనివారం విలేకరులతో మాట్లాడారు. కల్తీ మద్యంతో మహిళల తాడిబొట్లు తెంపుతున్న జగన్‌రెడ్డిపై ప్రజలకు విశ్వాసం పోయిందన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందన్నారు.

నీళ్లు అమ్ముకుంటున్నారు : రావి ధ్వజం

నందివాడ (తుమ్మలపల్లి) : సుమారు రూ.10 కోట్లు పెట్టి పుట్టగుంట వద్ద టీడీపీ ప్రభుత్వంలో ఎత్తిపోతల పథకం నిర్మిస్తే, 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వం రావటంతో ఎత్తిపోతల పథకం ప్రారంభించి దొంగ కమిటీలు వేసి చేపల చెరువులకు నీళ్లు అమ్ముకుంటున్నారని గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తుమ్మలపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రావి మాట్లాడుతూ రైతుల కష్టాలు చూడలేక తెలుగుదేశం ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మిస్తే, వైసీపీ పాలకులు చేపల చెరువులకు నీళ్లు అమ్ముకుంటుండటం సిగ్గుచేటన్నారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిలువునా మోసం చేస్తుందన్నారు. నీటి సంఘం మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ రవి మాట్లాడుతూ 4400 ఎకరాల రైతులకు నీళ్లు ఇవ్వటం కోసం ఎత్తిపోతల పథకం నిర్మించటం జరిగిందన్నారు. వైసీపీ నాయకులు అధికారులతో కుమ్మక్కై చేపల చెరువులకు నీళ్లు అమ్ముకుంటున్నారన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు మాట్లాడుతూ నందివాడ మండలంలో గ్రామాలకు తాగునీరు అందటం లేదన్నారు.

పెడన నియోజకవర్గంలో బాలశౌరి రోడ్‌షో

పెడన రూరల్ : అరాచకపు పాలన అంతమొందించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారం చేపట్టాల్సిన సమయం ఆసన్నమైందని కూటమి ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి అన్నారు. అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఆయన పెడన రూరల్ మండలంలో రోడ్‌షో నిర్వహించారు. చేవేంద్రలోని విఘ్నేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ర్యాలీ ప్రారంభించారు. కమలాపురం, చెన్నూరు, ఉరివి, లంకలకలవగుంట, నేలకొండపల్లి, పెనుమల్లి, ఎస్.వి.పల్లి, నందిగామ, కూడూరు, మీదుగా నడుపూరు వరకు నిర్వహించిన రోడ్‌షోలో అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పట్టారు. కృష్ణప్రసాద్ చెన్నూరులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, పెడన నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త పంచకర్ల సురేష్, సాదరబోయిన ఏడుకొం డలు, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, చెన్నూరు శేఖర్, ఊచ వెంకయ్య పాల్గొన్నారు.

కుమార్‌రాజా విజయం తథ్యం : జైపాల్

పామర్రు : ప్రజల ఆదరాభిమానాలతో టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా భారీ మెజార్టీ సాధించడం ఖాయమని మండల టీడీపీ ప్రచార పరిశీలకుడు జైపాల్ అన్నారు. కురుమద్దాలిలో మన ఇంటికి వర్ల కుటుంబం పేరుతో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. . నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే వర్లకుమార్ రాజాను అసెంబ్లీకి, రాష్ట్ర ప్రయోజనా లను దృష్టిలో ఉంచుకుని బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరికి అఖండ విజయాన్ని అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, కొసరాజు వేంకటేశ్వరరావు, దోవ వేణు, మండవ కృష్ణారావు, దాసరి రాజగోపాల్, ఫణేంద్ర, బాలకృష్ణ, దాలిపర్తి ప్రసాద్, జన్ను మురళి, వీరంకి వేంకటేశ్వరరావు, మంతెన రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మండలి, బాలశౌరిని గెలిపించుకుంటాం

నాగాయలంక : అవనిగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌తోనే తమ ప్రయాణమని నాలి, సొర్లగొంది గ్రామస్థులు అన్నారు. బుద్ధప్రసాద్‌ను శనివారం కలసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గం నుంచి మండలిని, ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరిని గెలిపించుకుంటామన్నారు. నాలి గ్రామ టీడీపీ అధ్యక్షుడు కొప్పనాతి వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ నాగరాజు, చింతా దుర్గారావు, విశ్వనాథపల్లి నాంచారయ్య, కొప్పనాతి వెంకటేశ్వరరావు, కొప్పనాతి నాగరాజు, విశ్వనాథపల్లి వీరలంకయ్య, కొప్పనాతి వీరుళ్లు, పెదసింగ్ నాగేంద్ర పాల్గొన్నారు.

గుడివాడ అభివృద్ధే లక్ష్యం : వెనిగండ్ల

గుడివాడ : నియోజకవర్గంలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యమని టీడీపీ భ్యర్థి అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. శనివారం 11వ వార్డులో వెనిగండ్ల ప్రచారం చేశారు. ముబారక్ సెంటర్‌లో వెనిగండ్లకు టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మె ల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, కూటమి నాయకులు యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాసరావు, సయ్యద్ హన్నూ, సయ్యద్ జబీన్, షేక్ మౌలాలి, షేక్ కరీముల్లా, పట్టపు చిన్నా, పట్టపు శ్రీనివాస్, కందుల సుబ్బారావు, కామేశ్వరరావు, అస్మా, నూర్జహాన్, ఖుద్దూస్, మల్లికా బేగం, వీరంకి వేణు పాల్గొన్నారు.

తుమ్మలపల్లిలో వెనిగండ్ల ప్రచారం

నందివాడ (తుమ్మలపల్లి) : గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించటంలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము విమర్శించారు. శనివారం తుమ్మలపల్లిలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, గుడివాడ అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ పిన్నమనేని పూర్ణ వీరయ్య చౌదరి (బాబ్జీ) తదితరులతో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి టీడీపీని అధికారంలోకి తేవాలన్నారు.

జగన్‌ను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధం : కుమార్ రాజా

పామర్రు : ప్రజల్ని అన్ని విధాల మోసం చేసిన జగన్ మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉంటే, జగనేమో నేను సిద్ధం.. మీరు సిద్ధమా అంటూ బస్సు యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా అన్నారు. టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక్కసారి అవకాశం ఇవ్వండి అంటూ ప్రజల్ని మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ ఆరాచక పాలన సాగిస్తూ సామాన్య ప్రజలను మోసం చేశాడన్నారు.

వర్ల విశ్రమ ప్రచారం

పెదపారుపూడి : డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి మహిళలు స్వశక్తితో ఎదిగేలా చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికే దక్కిందని వర్ల కుమార్ రాజా సతీమణి వర్ల విశ్రమ అన్నారు. వెంట్రప్రగడ పులవర్తి దళితవాడలో కుమార్ రాజా గెలుపు కోసం శనివారం ఆమె ప్రచారం నిర్వహించారు. చలసాని రమేష్ చౌదరి, కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, మైనేని ఇందిరా, కూచిపూడి జ్యోతి, చలసాని దివ్య, యార్లగడ్డ లక్ష్మీ, నత్త వాణి, చిలకా ఆంజనేయులు, కలపాల కిషోర్, జాజుల ప్రసాద్, బుడ్డాలు తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీపురంలో టీడీపీలో చేరిక

కృత్తివెన్ను : లక్ష్మీపురంలో మండల టీడీపీ అధ్యక్షులు ఒడగు తులసీరావు, గ్రామ అధ్యక్షుడు పులగం చిన్నబ్బులు ఆధ్వర్యంలో సుమారు 57 మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అందరూ కలిసి కట్టుగా వచ్చే ఎన్నికల్లో విజయం సాధించే దిశగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జనసేన అభ్యర్థుల విజయానికి ఐక్య కృషి


మాట్లాడుతున్న రామకృష్ణ, నాగాయలంకలో సంకల్ప యాత్ర

అవనిగడ్డ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో జనసేన పార్టీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జనసేన పార్టీ మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ కార్యదర్శి బండి రామకృష్ణ అన్నారు. అవనిగడ్డ జనసేన పార్టీ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మత్తి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బండి రామకృష్ణ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నాయకులు, కార్యకర్తలకు అవగాహన కల్పించారు. మచిలీపట్నం ఎంపీ అభ్యర్థిగా బాలశౌరిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా మండలి బుద్ధప్రసాద్‌లను గెలిపించాలని పిలుపునిచ్చారు. మచిలీపట్నం పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ కమిటీ కార్యదర్శిగా నియమితులైన బండి రామకృష్ణను మండలి బుద్ధప్రసాద్ దుశ్శాలువాతో సత్కరించారు. ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులు అక్కుల గాంధీ, బోని పార్వతీ, చిలకలపూడి పాపారావు, బాడిత శంకర్, అజయ్ వర్మ ఠాకూర్, జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు, గుడివాక శేషుబాబు, మండలి వెంకట్రామ్, రాజనాల వీరబాబు పాల్గొన్నారు.

నాగాయలంకలో జన సంకల్ప యాత్ర ప్రారంభం

నాగాయలంక : వైసీపీ పాలనతో అన్ని వర్గాల ప్రజలు విసుగెత్తిపోయారని ఎన్డీఏ కూటమి నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ అన్నారు. ఎన్డీఏ అభ్యర్థుల విజయం కోసం నాగాయలంకలోని విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో పూజలు చేసి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. వెంకట్రామ్ మాట్లాడుతూ ఎన్నికల్లో జనసేన, టీడీపీ, బీజేపీ ఎంపీ అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

వీకేఆర్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ వార్షికోత్సవం



గుడివాడ : వీకేఆర్ అండ్ వీఎన్‌బీ పాలిటెక్నిక్ కళాశాల 43వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా విద్యుత్ శాఖ డీఈఈ బి.శ్రీనివాసరావు విచ్చేసి జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ప్రతి విద్యార్థి పట్టుదలతో చదివి, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్య, క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల డైరెక్టర్ బి.కల్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎం.నాగు, ఏవో వెంకటరమణ, డిప్లొమో ఇన్‌చార్జి లోయ రాజా, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించండి



అగినపర్రు : రాష్ట్రాన్ని అభివృద్ధిబాటలో నడిపించేందుకు టీడీపీ, జనసేన, బీజేపీ కూ టమి అభ్యర్థులను గెలిపించాలని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కు మార్ రాజా సోదరుడు వర్ల చాణక్య అన్నారు. శనివారం అగినపర్రులో ఇంటింట ప్రచారం చేశారు. మండవ పూర్ణయ్య, అక్కినేని బుల్లయ్య, బొబ్బా వెంకటేశ్వరరావు, మోటూరు వెంకటసుబ్బయ్య, బోగ య్య, వీరంకి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

మోపిదేవి : కోసూరువారిపాలెం పంచాయతీ శివారు యాదవపాలెంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో వీరాంజనేయస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ శనివారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామస్థుల విరాళాలతో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉదయం 8.34 నిముషాలకు వీరాంజనేయస్వామి, గణపతి, శ్రీకృష్ణుగా విగ్రహాల ప్రతిష్ఠ వేదమంత్రోచ్చరణల నడుమ వాస్తోక్తంగా జరిపారు. అనంతరం పూర్ణాహుతి గావించారు. ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో ఐదు వేల మందికి అన్నసమారాధన నిర్వహించారు.

ఆలయ రికార్డుల తనిఖీ

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మ అమ్మవారి దేవస్థానం రికార్డులను శనివారం దేవదాయ ధర్మాదాయ శాఖ ఆర్జేసీ ఎం.విజయరాజు తనిఖీ చేశారు. తొలుత విజ యరాజు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు ఆయనకు శేషవస్త్రంతో సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఆలయాల బాకీలు వసూలు చేయండి

మచిలీపట్నం టౌన్ : ఆలయాలకు రావాల్సిన బాకీలను సత్వరం వసూలు చేయాలని దేవదాయ . ధర్మదాయ శాఖ ఆర్జేసీ జి. విజయబాబు సూచించారు. భద్రాద్రి రామాలయంలో శ్రీరామనవమి ఏర్పాట్లను పరిశీలించారు. ఆంధ్ర జాతీయ కళాశాలలో అసిస్టెంట్ కమిషనర్ చక్రధరరావుతో ఆదాయ వనరులపై చర్చించారు. ఆంధ్ర జాతీయ కళాశాల భూముల కౌలు రైతులు మాగాణి భూములను చేపల చెరువులుగా మార్చేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. ఇండోమెంట్స్ ఇన్‌స్పెక్టర్ కోట శ్రీనివాసరావు, ఈవోలు శిరీష, టి.వి.వి. మోహనరావు, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగిపై టీడీపీ ఫిర్యాదు

అవనిగడ్డ రూరల్ : ఏపీసీపీడీసీఎల్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వరిస్తూ వైసీపీ కార్యకర్తగా పని చేస్తున్న గరికిపాటి రాకేష్‌ని ఉద్యోగం నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బాల సుబ్రహ్మణ్యానికి మాజీ జడ్పీటీసీ సభ్యుడు కొల్లూరి వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. రాకేష్ వైసీపీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్నాడని, రాష్ట్రంలో ఎన్నికల కోడ్ నిబంధనలు ఉన్నప్పటికీ ఫేస్‌బుక్‌లో 'వికాస్' పేరుతో ఖాతా ప్రారంభించి మండలి బుద్ధప్రసాద్‌పై అసభ్య పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నాడని పేర్కొన్నారు. షేక్ బాబావలి, మేడికొండ ఆనంద్, కంచర్ల ఆనంద్, మెగావత్తు గోపి, గుంటూరు వినయ్, లింగం బాబురావు, చెన్ను బాబురావు, కొల్లూరి వాసు, కైతేపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జేటీవోకు ఎక్స్‌లెన్స్ అవార్డు



చల్లపల్లి : జిల్లాలో 2023-24 సంవత్సరానికి బీఎస్ఎన్ఎల్ ఫైబర్ నెట్ కనెక్షన్లు అత్యధికంగా చేసినందుకు చల్లపల్లి జూనియర్ టెలికాం ఆఫీసర్ డి. రామకృష్ణకు బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వై.రవీంద్రనాథ్ చేతుల మీదుగా ఎక్సలె న్స్ సర్టిఫికెట్ ప్రదానం చేసి అభినందించారు.

సినీఫక్కీలో సెల్‌ఫోన్‌ల చోరీ

చల్లపల్లి : చల్లపల్లిలో సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ల చోరీలు కలకలం రేకెత్తించాయి. బైక్‌పై ఓ యువకుడు వచ్చి బైక్ ఆపి పడిపోతున్నట్లుగా నటిస్తూ బండి పైకి లేపేందుకు సహాయం కోరటం, సహాయం చేసేందుకు వచ్చిన వారి సెల్‌ఫోన్‌ను వెనుక నుంచీ వచ్చిన మరో యువకుడు చాకచక్యంగా చోరీ చేసి బండి ఎక్కటం, ఇద్దరూ కలిసి పారిపోవటం జరుగుతోంది. శనివారం నారాయణరావు నగర్‌కు చెందిన వృద్ధుడి నుంచీ, పోలీస్‌స్టేషన్ సమీపంలో దుకాణదారుని వద్ద రెండు సెల్‌ఫోన్లు చోరీ జరిగాయి. గాలింపు చర్యలు వేగవంతం చేసినట్లు చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబులు తెలిపారు.